# అరబ్ విప్లవం - నవ వసంతం

**పాలకుల నియంతృత్వ పోకడలు, అవినీతిమయమైన పాలన, నిరుద్యోగం వంటి సమస్యలతో దశాబ్దాలుగా విసిగి వేసారిన ప్రజలు అకస్మాత్తుగా తిరుగుబాటు బావుటా ఎగుర వేయడంతో అరబ్ దేశాల్లో ఉద్యమాలు ఊపిరిపోసుకున్నాయి. వీటి ప్రభావానికి ఏళ్ల తరబడి పాలకపగ్గాలు తమ చేతుల్లో ఉంచుకున్న ఈజిప్టు, ట్యునీషియా అధ్యక్షులు తమ పదవులకు రాజీనామా చేశారు. మరికొందరు దేశాధినేతలు రాజకీయ, ఆర్థిక సంస్కరణలకు నాంది పలికారు. మొత్తం మీద అరబ్ దేశాల్లోని ప్రజల ఉద్యమాలు ఆయా దేశాల్లో నవ వసంత వీచికలుగా మారాయి.**

అరబ్ ప్రజల చరిత్రలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభు త్వ వ్యతిరేక ఉద్యమాలు/విప్లవాలు ఒక రకంగా వసంతోదయమే. ప్రఖ్యాత అరబ్ చరిత్రకారుడు ఇబిన్ కల్దున్.. తమ దేశాల్లలోని నియంతృత్వ అవినీతి పరమైన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెల్లుబికిన అరబ్ ప్రజల నిరసనను 'అసబియ' (సామూహిక సంఘీభావం) అని వర్ణించాడు. డిసెంబర్ 18, 2010న ప్రారంభమైన ఈ తిరుగుబాటు ఈనాటికీ కొనసాగుతూనే ఉంది. ట్యునీషియా, ఈజిప్టు దేశాల్లో విప్లవం విజయవంతమై ఆ దేశాల పాలకులు పదవీచ్యుతులు కాగా, బహ్రెయిన్, సిరియా, లిబియా, యెమెన్ దేశాల్లో పౌరులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. అల్జీరియా, ఇరాక్, జోర్డాన్, మొరాకో, ఒమన్ దేశాల్లో భారీ ఎత్తున నిరసన గళాలు వినిపించాయి. కువైట్, లెబనాన్, మారిటోనియా, సౌదీ అరేబియా, సుడాన్, పశ్చిమ సహారా దేశాల్లో స్వల్ప ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఈ దేశాల్లో ప్రజలు తమ నిరసనను సమ్మెలు, ప్రదర్శనలు, కవాతుల ద్వారా తెలియజేయడంతో పాటు.. సామాజిక మాధ్యమాలైన (Social Media) ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లను విస్తృతంగా ఉపయోగించి ప్రజలను చైతన్యపరిచారు. ప్రజల నిరసనను ఆయా దేశాల ప్రభుత్వాలు బలప్రయోగంతో అణచివేయడానికి ప్రయత్నించిన నేపథ్యంలో వేలకొద్దీ మరణించడం, తీవ్రంగా గాయపడటం చోటు చేసుకుంది. ప్రభుత్వ మద్దతుదారులు, సాయుధ బలగాలు ప్రతి దాడికి దిగాయి.

**అరబ్ ప్రజల నినాదం:**

**''ప్రజల కోరిక నిరంకుశ ప్రభుత్వాల పతనం''.**

## మధ్య ప్రాచ్య, ఉత్తర ఆఫ్రికా దేశాల్లో కొనసాగుతున్న ఉద్యమాలకు నాంది:

పోలీసుల దురుసు వైఖరికి నిరసనగా ట్యునీషియాలో మహ్మద్ బౌజిజ్



అనే నిరుద్యోగ యువకుడి ఆత్మార్పణం (Self Immolation) దేశ వ్యాప్త నిరసన (డిసెంబర్ 18, 2010)కు దారి తీసింది. ఇది విజయవంతం అవడం అల్జీరియా, జోర్డాన్, ఈజిప్టు, యెమెన్ దేశాల్లో అలజడులు మొదలయ్యాయి. ప్రతి శుక్రవారం నమాజ్ ముగిసిన తర్వాత ఈ నిరసనలు తారాస్థాయికి చేరుకుంటాయి. ఈ నిరసనల ప్రభావం మిగతా ప్రాంతాల్లో ప్రకంపనలు సృష్టించింది. వీటి ఫలితంగా ట్యునీషియా, ఈజిప్టు దేశాల అధ్యక్షులు పదవీచ్యుతులయ్యారు. ట్యునీషియా అధ్యక్షుడు సౌదీ అరేబియాకు పారిపోయి తలదాచుకుంటున్నాడు. 30 సంవత్సరాల సుదీర్ఘ పాలనకు చరమగీతం పాడుతూ ఈజిప్టు అధ్యక్షుడు హోస్నీ ముబారక్ సాయుధ బలగాల ఒత్తిడి మేరకు రాజీనామా చేశాడు. దీంతో ఆ ప్రాంతంలోని కొందరు దేశాధ్యక్షులు రాజకీయ, ఆర్థిక సంస్కరణలకు నాంది పలకడంతోపాటు, తమ పదవీకాలం ముగిశాక తిరిగి ఎన్నికల్లో పోటీ చేయబోమని ప్రకటించారు.

## నిరసన ఉద్యమాలకు దారి తీసిన పరిస్థితులు:

ఈ దేశాల్లోని నిరంకుశ ప్రభుత్వాల వైఖరి, మానవ హక్కుల ఉల్లంఘన, మితిమీరిన అవినీతి ప్రజల ఆగ్రహానికి దారి తీశాయి. ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, పేదరికం, విద్యావంతులైన యువతలో పెల్లుబికిన అసంతృప్తి తదితర కారణాలు నిరసన ఉద్యమాలకు కారణమయ్యాయి. ఉత్తర ఆఫ్రికా, గల్ఫ్ దేశాల్లో దేశ సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం, పాలనలో పారదర్శకత లోపించడం, పెరుగుతున్న అవినీతి, యువతలో నైరాశ్యం వంటి అంశాలు అకస్మాత్తుగా తలెత్తిన ఈ అలజడులకు ప్రేరకాలుగా పనిచేశాయి. పెరుగుతున్న ఆహార ధాన్యాల ధరలు ప్రపంచ వ్యాప్తంగా ఆహార అభద్రతకు దారితీశాయి. అరబ్ దేశాల మీద ఈ ప్రభావం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అమెరికా దౌత్య ఉత్తర ప్రత్యుత్తరాలను వికీలీక్స్ బహిర్గతం చేయడం మరో బలీయమైన కారణం. ఈ దేశాల్లో సగటు పౌరుల్లో తమ పాలకులు అమెరికాతో కుమ్మక్కై, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే భావన బలీయంగా నాటుకుంది.

ఇటీవల కాలంలో అరబ్ దేశాల్లో సగటు జీవన ప్రమాణం మెరుగవడంతోపాటు, నిరక్షరాస్యత పెరగడం, విద్యాధికుల సంఖ్య పెరగడం వంటివి సామాజిక చైతన్యానికి దారి తీశాయి. ఆశించిన మేరకు

SAKSHI

సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు చోటు చేసుకోకపోవడంతో సహనాన్ని కోల్పోయి నిరసనలకు పూనుకున్నారు. అంతర్జాలం (ఇంటర్నెట్), పాశ్చాత్య దేశాల్లో విద్య వంటివి యువతరాన్ని ప్రేరేపించి.. నియంతృత్వ ధోరణుల పట్ల ఏహ్య భావాన్ని కలిగించాయి. ఇది ఒక రకంగా యువకంపం (Youth Quake). అల్జీరియా, లిబియా దేశాల్లో ఇంధన ఆధారిత వనరులు పుష్కలంగా ఉన్నాయి. అందువల్ల ఉద్యమకారుల నిరసనలకు తక్షణం తలొగ్గి తాత్కాలికంగా ఉపశమనం పొందాయి. ఈజిప్టు, ట్యునీషియా దేశాల్లో ఆర్థిక వనరులు అంతంతమాత్రమే కనుక ఉద్యమ కారుల అన్ని కోర్కెలను తీర్చలేక పోయాయి.

## ఇటీవల చరిత్ర:

ప్రస్తుత సంక్షోభం వెనుక ఇటీవల కాలంలో చోటు చేసుకున్న సంఘటనల ప్రభావం ఉంది. ట్యునీషియా, అల్జీరియా, పశ్చిమ సహారా ప్రాంతాల్లో అసమ్మతి వర్గాల ఆందోళనలు, సామాజిక, కార్మిక సంఘాల అసంతృప్తి ప్రస్తుత అలజడులకు ఊపిరిపోశాయి. ట్యునీషియాలో గత మూడేళ్లుగా గఫ్సా ప్రాంతంలోని గనుల్లో తరచు సమ్మెలు, తగవులు చోటు చేసుకుంటున్నాయి. కార్మిక అశాంతికి దోహదం చేశాయి. ఈజిప్టులో ఏప్రిల్ 8, 2008న జౌళి పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు తలపెట్టిన సమ్మె దేశవ్యాప్త మద్దతు పొందింది. ఫేస్‌బుక్ ద్వారా విద్యాధికులైన యువత నిరసనకారులను సమీకరించి భారీ ఎత్తున ముబారక్ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించింది. జనవరి 25, 2011న తహ్రీర్‌స్క్వేర్‌లో జరిగిన భారీ ప్రదర్శన ముబారక్ పతనానికి నాంది పలికింది. అల్జీరియాలో సమాజంలో వివిధ వర్గాల్లో రగులుతున్న అసంతృప్తి 2010 లో ఎన్నో దొమ్మీలకు దారి తీసింది. విద్య, ఆరోగ్య సదుపాయాల కొరత, అవినీతి ఇందుకు ప్రధాన కారణాలు. పశ్చిమ సహారాలో కార్మిక వివక్ష, నిరుద్యోగ సమస్య, మానవ హక్కుల ఉల్లంఘన, ప్రభుత్వ ఆస్తుల లూటీ తదితర సంఘటనలు గత ఏడాది అక్టోబర్, నవంబర్‌లలో నిరసనలకు మూలం. భద్రతా దళాల దురుసు వైఖరి సహ్రావి యువత ఆగ్రహానికి దారి తీసింది.

## ఉద్యమ ప్రభావం:

అసమ్మతి సెగ అరబ్ ప్రపంచానికి మాత్రమే పరిమితం కాలేదు. ఉత్తర ఆఫ్రికాలోని విప్లవాలు విజయవంతం కావడం మధ్య ప్రాచ్య దేశాలు, ఇరాన్, టర్కీ దేశాల అసంతృప్తి జనాన్ని ప్రేరేపించింది. ఇరాన్, టర్కీలలో ఉవ్వెత్తున ఎగసిన నిరసనలు అరబ్బేతర ప్రజలవి. ఆర్మేనియా, అజర్ బైజన్, జార్జియా దేశాలతోపాటు ఐరోపాలోని అల్బేనియా, క్రొషియా, స్పెయిన్ దేశాలకు వ్యాపించింది. సహారా ఆఫ్రికా దిగువన ఉన్న బుర్కినాఫాసో, జబుటి, ఉగాండా దేశాలతో పాటు ఆసియాలోని మాల్దీవులను ప్రభావితం చేసింది. చివరికి చైనాకు కూడా ఈ ప్రకంపనలు వ్యాపించాయి. అంటే మొత్తం ముస్లిం ప్రపంచాన్ని ఇది ప్రభావితం చేసిందని చెప్పవచ్చు.

అరబ్ విప్లవంలో ఉత్తేజితులైన పాలస్తీనీయులు ఫేస్‌బుక్ ద్వారా మూకుమ్మడి నిరసనలకు పిలుపునిచ్చారు. మూడో పాలస్తీనా ఇంతిఫాదాను మే 15, 2011న ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఈజిప్టు, లెబనాన్, జోర్డాన్‌లో ఉన్న పాలస్తీనియులు 'నక్బదినాన్ని' పాటించాలని, పాలస్తీనా కాందిశీకులకు తమ స్వస్థలాలకు తిరిగొచ్చే హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులు ఇజ్రాయెల్ సరిహద్దులోకి ప్రవేశించడానికి ప్రయత్నించినప్పుడు ఇజ్రాయెల్ ప్రభుత్వం కాల్పులు జరిపి వారిని నిరోధించింది. తూర్పు జెరూసలెంలో కూడా అలజడులు జరిగాయి.

విశ్లేషకులు ఈ సంఘటనలను అరబ్ దృగ్విషయం గా చిత్రీకరించడానికి ప్రయత్నించినప్పటికీ, ఇది వాస్తవంగా ఆయా దేశాల్లో అరబ్బేతర ప్రజలను ప్రభావితం చేసింది. ట్యునీషియాలో యూదులు, ఈజిప్టులో కాప్టిక్ క్రిస్టియన్లు, లిబియాలో బెర్బర్లు, సుడాన్‌లో డార్ఫరిస్, ఇరాక్, సిరియా దేశాల్లో అల్ప సంఖ్యాక ఖుర్దులు ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

అరబ్ విప్లవం ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మద్దతు పొందింది. అరబ్ దేశాల ప్రభుత్వాలు అనుసరించిన హింసాత్మక వైఖరి తీవ్ర విమర్శకు గురైంది. ఈ ఉద్యమం పట్ల పాశ్చాత్య దేశాలు అనుసరించిన ద్వంద్వ వైఖరి తీవ్ర విమర్శలకు దారి తీసింది. నయోమ్ చోమిస్కీ, ఒబామా ప్రభుత్వం మధ్య ప్రాచ్య ప్రజల ప్రజాస్వామ్య ఆకాంక్షను అణచి వేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ ఉద్యమం ఇంధన ధరలను ప్రభావితం చేసింది. 2011లో కొనసాగుతున్న ఇంధన సంక్షోభానికి దారితీస్తోంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి అభిప్రాయంలో మధ్య ప్రాచ్య సంక్షోభం ఇంధన ధరలు పెరగడానికి దోహదం చేస్తోందని.. ఇది ఇప్పుడే కుదుటపడుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత కుంగదీస్తోందని ఆందోళన వెలిబుచ్చింది.

మొత్తంమీద, అరబ్ తిరుగుబాటు నియంతలకు కనువిప్పు. ఇది అరబ్ దేశాల ప్రజాస్వామ్యీకరణకు, సాధారణ ప్రజల సాధికారతకు దోహదం చేస్తుంది. మిగతా దేశాల్లోని బాధ్యతారహిత పాలకులకు ఇది ఒక ప్రమాద సూచిక కావాలి. 21వ శతాబ్దం ఆచరణాత్మకమైన ప్రజాస్వామ్యీకరణకు ఆనవాలు కావాలి.

### ముఖ్యాంశాలు

- ప్రఖ్యాత అరబ్ చరిత్రకారుడు ఇబిన్ కల్దున్.. తమ దేశాల్లోని నియంతృత్వ అవినీతిపరమైన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెల్లుబికిన అరబ్ ప్రజల నిరసనను 'అసబియ' (సామూహిక సంఘీభావం) అని వర్ణించాడు.
- ట్యునీషియాలో మహ్మద్ బౌజిజ్ అనే నిరుద్యోగ యువకుని ఆత్మార్పణం దేశవ్యాప్త నిరసనకు దారి తీసింది.
- నిరసనలకు తలొగ్గి, సాయుధ బలగాల ఒత్తిడి మేరకు తన 30 ఏళ్ల సుదీర్ఘ పాలనకు ఈజిప్టు అధ్యక్షుడు హోస్నీ ముబారక్ రాజీనామా చేశాడు.

- అమెరికా దౌత్య ఉత్తర, ప్రత్యుత్తరాలను వికీలీక్స్ బహిర్గతం చేయడం కూడా నిరసనలకు ఒక ప్రధాన కారణం.
- ఈజిప్టులో ఏప్రిల్ 8, 2008 న జౌళి పరిశ్రమ కార్మికులు తలపెట్టిన సమ్మెకు దేశవ్యాప్త మద్దతు లభించింది.
- అరబ్ విప్లవంతో ఉత్తేజితులైన పాలస్తీనీయులు 'మూడో పాలస్తీనా ఇంతిఫదా'ను మే 15, 2011న ప్రారంభించాలని పిలుపునిచ్చారు.
- మధ్య ప్రాచ్యంలోని సంక్షోభం ఇంధన ధరల పెరుగుదలకు దోహదం చేస్తుందని, ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత కుంగదీస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి ఆందోళన వెలిబుచ్చింది.

SAKSHI